బతుకమ్మ ఘాట్ లేక హైవేపై ఆడుతున్న మహిళలు

బతుకమ్మ వేడుకలకు సౌకర్యాలు కరువు

- ఇబ్బంది పడుతున్న మహిళలు
- పట్టించుకోని అధికారులు

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 8: బతుకమ్మ వేడుకలకు సరైన సౌకర్యాలు లేక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని బేతోలు గ్రామంలో బతుకమ్మ సంబురాలకు ఏర్పాట్లు చేయకపోవడంతో జాతీయ రహదారిపై బతుకమ్మలను పెట్టి ఆడాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో బతుకమ్మ పండుగకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించగా, సంబురంగా వేడుకలు జరుపుకొన్నామన్నారు. ఈ ఏడాది బతుకమ్మ వేడుకలకు అధికారులు ఎటువంటి ఏర్పాట్లు చేయలేదని ఆరోపించారు. అనేక సార్లు బేతోలు కూడలి వద్ద మహిళలకు బతుకమ్మ ఘాట్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదన్నారు. రోడ్డుపై బతుకమ్మ ఆడడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నదని, అధికారులు స్పందించి బతుకమ్మ వేడుకలకు ఏర్పాటు చేయాలని మహిళలు కోరుతున్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కేసముద్రం, అక్టోబర్ 8: కేసముద్రం స్టేషన్ హైస్కూల్‌లో 1997-98 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం పాఠశాలలో కలుసుకున్నారు. చిన్న నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చిలువేరు సమ్మయ్యగౌడ్, శాగంటి రాములు, వెంకట్, కన్నా, గొట్టం లక్ష్మణ్, చందర్, పులిగిల్ల కిరణ్, కొండబోయిన అశోక్, మేనక, కవిత, వారద, రమాదేవి ఉన్నారు.

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

'పంటల నమోదు' వినియోగించుకోవాలి

కొత్తగూడ, అక్టోబర్ 8: మండలంలో పంటల నమోదు కార్యక్రమాన్ని ఏఈవోలు విజయవంతం చేయాలని మహబూబాబాద్ వ్యవసాయ సహాయ సంచాలకుడు అజ్మీరా శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కొత్తగూడ, గంగారం మండలాల్లో పంటల నమోదును ఆయన పరిశీలించారు. అనంతరం ఫర్టిలైజర్స్, ఓడీసీఎంఎస్, పెద్దెల్లాపూర్ పీఏసీఎస్, పొగుళ్లపల్లి ఫర్టిలైజర్స్ షాపులను తనిఖీ చేశారు. గంగారం మండలంలోని మహదేవునిగూడెంలో, కొత్తగూడ మండలం తిమ్మాపూర్‌లో పంటల నమోదును పరిశీలించారు. రైతులకు పంటలపై సలహాలు, సూచనలు చేశారు. ఏఓ ఉదయ్, ఏఈవోలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుపై బురద.. నడిచేదేలా..?

నర్సింహులపేట, అక్టోబర్ 8: మండలంలోని గ్రామాల్లో చిన్న వానకే రోడ్లపై బురద నిలిచి నడులేని పరిస్థితి నెలకొన్నది. పెద్దనాగారంలో బతుకమ్మ పండుగ పూట చెరువు వద్దకు వెళ్లే దారిలో సీసీ రోడ్డుపై బురద చేరడంతో రోడ్డుపై వెళ్లేందుకు ఇబ్బందిగా ఉన్నదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీసీ రోడ్డు పక్కన కాల్వ తీస్తే రోడ్డుపై బురద నీరు వచ్చే అవకాశం లేదని, పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సద్దుల బతుకమ్మ నాటికి రోడ్లపై మురుగు నీరు లేకుండా చేసి, గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సీసీ రోడ్డుపై పారుతున్న బురద నీరు

డీఎస్సీలో మెరిసిన విద్యా కుసుమాలు

నర్సింహులపేట, అక్టోబర్ 8: డీఎస్సీ -2024 ఫలితాల్లో జిల్లాలోని అభ్యర్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ఉద్యోగాలకు ఎంపికయ్యారు. నర్సింహులపేటకు చెందిన 10మంది కొలువులు సాధించారు. మండల కేంద్రంలో ఇప్పటికే సుమారు 100 మందికిపైగా ఉపాధ్యాయ వృత్తిలో పనిచేశారు. స్కూల్ అసిస్టెంట్ బయోలజీకి సమ్మెట ప్రభాకర్, తెలుగు పోస్టుకు దోమల యాకస్వామి, లింగాల మమత, మల్లం కవిత, పీఈటీగా సుంకరి రవి ఉద్యోగం సాధించగా, ఎస్‌జీటీలుగా పోచారం వీరేందర్, వెంకటేశ్, ఎర్ర తేజశ్విని, బోగి యామిని, చెన్నూరు రుచితరెడ్డి ఉద్యోగం సాధించారు.

ఉద్యోగం సాధించిన కానిస్టేబుల్

బయ్యారం: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో 2020 నుంచి కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న ధరావత్ రంజిత్ ఎస్‌జీటీ టీచర్‌గా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉద్యోగం సాధించాడు. ఓవైపు విధులు నిర్వరిస్తూ మరో మరోవైపు డీఎస్సీ ఫలితాల్లో ప్రతిభ చాటడంతో ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, డీఎస్పీ తిరుపతిరావు, సీఐ రవికుమార్, ఎస్సై తిరుపతి అభినందించారు.

బయ్యారం: రంజిత్‌ను అభినందిస్తున్న ఎస్పీ

కురవిలో షాహెదా..

కురవి : మండలంలోని తిర్మలాపురం గ్రామానికి చెందిన ఎండీ షాహెదా బేగం 8 నెలల వ్యవధిలో రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. మహబూబాబాద్‌లోని ట్రైబల్ గురుకులంలో టీజీటీ హిందీగా విధులు నిర్వర్తిస్తున్నారు. డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ హిందీలో జిల్లా రెండో ర్యాంకు సాధించారు. మండల వాసులు, బంధువులు అభినందించారు.

నాలుగు కొలువులు సాధించిన విజయ్‌కుమార్

దంతాలపల్లి: మండలంలోని వాల్యతండాకు చెందిన బానోత్ వీరన్న-శాంతల కుమారుడు విజయ్ కుమార్ 2019లో ఎస్ఎస్‌సీ కానిస్టేబుల్, 2022లో సింగరేణిలో, 2023లో ఆర్ఆర్‌బీ గ్రూప్ డీలో ఉద్యోగం సాధించాడు. అయినా తగ్గకుండా డీఎస్సీ పరీక్ష రాయగా ఎస్‌జీటీలో జిల్లా 33 ర్యాంకు సాధించాడు. ఎస్టీలో జిల్లా మొదటి స్థానం సాధించాడు. నాలుగు ఉద్యోగలు సాధించిన విజయ్‌కుమార్‌ను తండావాసులు అభినందించారు.

ఉద్యోగం సాధించిన అభ్యర్థులు

షాహెదా

విజయ్‌కుమార్

అపార్ట్‌మెంట్‌లో షార్ట్ సర్క్యూట్

- మంటల్లో కాలిపోయిన వస్తుసామగ్రి
- ఫైరింజన్ మొరాయించడంతో మంటలు ఆర్పిన స్థానికులు

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 8 : మహబూబాబాద్ కంకరబోర్డ్‌కాలనీలోని ఎస్వీ అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం జరిగింది. 3వ అంతస్తులోని 303 రూమ్‌లో షార్ట్ సర్క్యూట్ వల్ల ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. ఈ ఘటన మంగళవారం మధ్యాహ్నం వేళ జరుగగా జి.జీవిత-నాగరాజుకు చెందిన ఇంట్లోని వస్తువులన్నీ కాలిపోయాయి. ఫైర్ ఇంజిన్ చేరుకున్నప్పటికీ మొరాయించడంతో స్థానికులే మంటలను అదుపు చేశారు. వివరాలిలా ఉన్నాయి. అపార్ట్‌మెంట్‌లో అగ్ని ప్రమాదం జరగడంతో స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. 15 నిమిషాలకు ఫైరింజిన్ చేరుకున్నప్పటికీ మూడో అంతస్తులో బెడ్‌రూమ్‌లో నుంచి మంటలు ఎగిసిపడడంతో ఆర్పేసేందుకు సిబ్బంది ప్రయత్నం చేసే క్రమంలో ఇంజిన్ మొరాయించి నీరు సరఫరా కాలేదు. సుమారు గంటన్నర సేపు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో అపార్ట్‌మెంట్‌వాసులు ఆందోళన చెందారు. వెంటనే అందరూ కిందకు దిగి వచ్చారు. ఆ తర్వాత నెల్లికుదురు మండల అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇవ్వగా అక్కడినుంచి ఇంజిన్ వచ్చే లోపే అపార్ట్‌మెంట్‌వాసులందరూ కలిసి మంటలను ఆర్పేశారు.



అపార్ట్‌మెంట్ నుంచి వస్తున్న మంటలు, కాలిన వస్తువులు

సర్టిఫికెట్లు, దస్తావేజులు కాలిపోయాయి

ఇంట్లో ఒక్క వస్తువు కూడా లేకుండా అన్నీ మంటల్లో కాలి బూడిదయ్యాయి. రెండేళ్ల క్రితం హనుమకొండ ఇండియన్ బ్యాంక్ నుంచి ట్రాన్స్‌ఫర్‌పై ఇక్కడికి వచ్చి ఎస్వీ అపార్ట్‌మెంట్‌లో కిరాయి ఉంటున్నాం. రెండు రోజుల నుంచి కరెంట్ హెచ్చుతగ్గుల వల్ల ఏసీ, గీజర్ పనిచేయడం లేదు. ఉదయం కూడా ఏసీ పనిచేయలేదు. ఉదయం పది గంటలకు ఇంటికి తాళం వేసి డ్యూటీకి వెళ్లాను. రెండు గంటలకు అపార్ట్‌మెంట్ నుంచి మంటలు వస్తున్నాయని ఫోన్ రావడంతో ఫైర్ ఇంజిన్‌కు సమాచారం ఇచ్చాం. సకాలంలో ఫైర్ అధికారులు స్పందించి మంటలు ఆర్పేస్తే ఇంత నష్టం జరిగేది కాదు. ఒరిజినల్ సర్టిఫికెట్లు, భూముల దస్తావేజులు, 30 తులాల బంగారం, వస్తువులు కాలిపోయాయి.

- జీ జీవిత, ఇండియన్ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్

కార్మికుల హక్కుల సాధనే లక్ష్యం

బయ్యారం, అక్టోబర్ 8 : కార్మికుల హక్కుల సాధనే భారత కార్మిక సంఘాల సమైక్య (ఇఫ్టూ) లక్ష్యమని జిల్లా ప్రధాన కార్యదర్శి బిల్లకంటి సూర్యం అన్నారు. ఈనెల 20న ట్రేడ్ యూనియన్ సెంట్రల్ ఆఫ్ ఇండియా టీయూసీఎల్‌లో విలీనం కానున్న సందర్భంగా అందుకు సంబంధించిన పోస్టర్‌ను బయ్యారంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో వివిధ రంగాల కార్మికుల మద్దతుతో ఇఫ్టూ దేశవ్యాప్తంగా 14రాష్ట్రాల్లో సంఘటిత, అసంఘటిత కార్మికవర్గ హక్కుల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించిందన్నారు. హక్కుల సాధన కోసం కార్మికవర్గం ఉద్యమాలకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షుడు జక్కుల యాకయ్య, నాయకులు లచ్చయ్య, దనుంజయ, రమేశ్, పూర్ణ, వెంకన్న, కృష్ణ, ఎస్కే జానీ, గుట్ట య్య, నారాయణరెడ్డి, రవి, రమేశ్, శ్రీను పాల్గొన్నారు.

మహిళల హామీలు విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

బయ్యారం, అక్టోబర్ 8: ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కందునూరి కవిత అన్నారు. మంగళవాం మండల కేంద్రంలోని బుడగజంగాల కాలనీలో నిర్వహించిన అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం నాల్గవ మండల మహాసభలో ఆమె మాట్లాడారు. బతుకమ్మ చీరెలకు బదులుగా రూ.500 ఇస్తామని చెప్పిన సర్కారు మరిచిందన్నారు. రాష్ట్రంలో మహిళలపై అనేక దాడులు జరుగుతున్నాయని, వాటిని అరికట్టాలన్నారు. అనంతరం మండల కార్యదర్శిగా కడారి విజయ, అధ్యక్షురాలుగా నిడికొండ వెంకటరమణను ఎన్నుకొని జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నిడికొండ సైదమ్మ, సిరిగిరి సమ్మక్క, గంగా, విడికొండ ఏసుమణి, అపరంజి కీర్తన, అఖిల తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

ఇనుగుర్తి, అక్టోబర్8: మండలంలోని చిన్నముప్పారం గ్రామంలో మంగళవారం రాత్రి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు మాట్లాడుతూ ప్రతి ఏడాది సద్దుల బతుకమ్మ ముందు గ్రామంలో ఎడ్లబండ్లను తిప్పి స్వామి వారిని ఊరేగిస్తామని తెలిపారు. అనంతరం పురాణ గాథలను కథలుగా చెబుతారన్నారు. బ్రహ్మోత్సవాలను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

నిబంధనల మేరకు ఎమ్మెల్సీ ఓటరు జాబితా

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 8: నిబంధనల ప్రకారం ఎమ్మెల్సీ ఓటరు జాబితాను రూపకల్పన చేసినట్లు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సీ సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఆయన గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాల ఓటరు జాబితాపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఆర్డీవోలు అలివేలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహిళలపై దాడులను అరికట్టాలి : ఐద్వా

కేసముద్రం, అక్టోబర్ 8: మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఐద్వా జిల్లా కార్యదర్శి గాడిపల్లి ప్రమీల అన్నారు. మంగళవారం కేసముద్రంలో నిర్వహించిన ఐద్వా మండల మహాసభలో ఆమె మాట్లాడారు. మహిళలపై దాడులు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో వేల్పుగొండ సావిత్రి, పొన్నాల జ్యోతి, మేకల నాగమణి, లక్ష్మి, కవిత, సాలమ్మ ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ హామీలను వెంటనే అమలు చేయాలి

కురవి, అక్టోబర్ 8: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.రెండు లక్షల వరకు రుణమాఫీ, రైతు భరోసా వంటి హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ పూర్తి కావస్తున్నా రైతు భరోసా జమ చేయకపోవడం శోచనీయమన్నారు. భారీ వర్షాల వల్ల తెగిన చెరువుల, కుంటల కట్టలకు వెంటనే మరమ్మతులు చేయించాలని, ఎస్సారెస్పీ జలాలతో చెరువులు, కుంటలను నింపి రబీలో సాగు అందించాలని కోరారు. మండల కార్యదర్శి కరణం రాజన్న, తురక రమేశ్, బొల్లం ఉప్పలయ్య, కలగూర నాగరాజు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

వైద్యశాఖ నోడల్ అధికారిగా రాజ్‌కుమార్

గార్ల, అక్టోబర్ 8: గార్ల-బయ్యారం మండలాల వైద్యారోగ్య శాఖ నోడల్ అధికారిగా ముల్కనూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి రాజ్‌కుమార్ జాదవ్‌ను నియమిస్తూ మంగళవారం హెల్త్‌డైరెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం బాధ్యతలు చేపట్టారు. రోగులకు మెరుగైన వైద్యం అందేలా శక్తివంచన లేకుండా కృషి చెస్తానని తెలిపారు.

డాక్టర్ రాజ్‌కుమార్‌జాదవ్

ప్రజా సంక్షేమాన్ని మరిచిన మోదీ ప్రభుత్వం

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య

కురవి, అక్టోబర్ 8: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నదని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జీ నాగయ్య అనారు. మండలంలోని నేరడలో మంగళవారం నిర్వహించిన పార్టీ మహా సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్విస్ బ్యాంకుల్లో ఉన్న నల్లధనం బయటకు రాకపోగా ప్రభుత్వ బ్యాంకులకు కుచ్చుటోపి పెట్టి దేశం నుంచి అనేక మంది పెద్దలు పారిపోయారని చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థలను విక్రయిస్తున్నారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆకుల రాజు, శెట్టి వెంకన్న, మండల కార్యదర్శి మల్లిడి కోటయ్య పాల్గొన్నారు.

మహాసభలో మాట్లాడుతున్న నాగయ్య

వాణిజ్యం

సామ్‌సంగ్ టాప్

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ సామ్‌సంగ్ మరోసారి సత్తాను చాటింది. ప్రస్తుత పండుగ సీజన్ తొలి విడుతలో కంపెనీ మొబైళ్లకు కొనుగోలుదారుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సీజన్‌లో అమ్ముడైన ఫోన్లలో 20 శాతం మార్కెట్ వాటాతో సామ్‌సంగ్ తొలిస్థానంలో నిలిచిందని టెక్ ఇన్‌సైట్స్ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అలాగే సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 6 వరకు కేవలం 11 రోజుల్లోనే 10 లక్షలకు పైగా ఐఫోన్లు కొనుగోలు చేశా రు. అత్యధికంగా అమ్ముడైన ఫోన్లలో గెలాక్సీ ఎం35, గెలాక్సీ ఎస్23, గెలాక్సీ ఏ14, గెలాక్సీ ఎస్23 ఎఫ్ఈలు ఉన్నాయి. బిగ్ బిలియన్ డేస్ పేరుతో ఫ్లిప్‌కార్ట్ ప్రత్యేక ఆఫర్లు ప్రకటించగా, అమెజాన్ ఇండియన్ ఫెస్టివల్ పేరుతో ఆఫర్లను తీసుకొచ్చాయి.

టాటా టెక్నాలజీస్‌తో బీఎండబ్ల్యూ జట్టు

ముంబై, అక్టోబర్ 8: టాటా టెక్నాలజీస్, బీఎండబ్ల్యూ గ్రూప్ జట్టు కట్టాయి. మంగళవారం తమ జాయింట్ వెంచర్ (జేవీ)ను అధికారికంగా ప్రకటించాయి. బీఎండబ్ల్యూ టెక్‌వర్క్స్ ఇండియా పేరిట ఈ జేవీని తెచ్చారు. సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ వెహికిల్స్ (ఎస్‌డీవీ)సహా ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్, ఐటీ వ్యాపారం కోసం డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సొల్యూషన్స్‌ను ఇది అభివృద్ధి చేయనున్నది. కాగా, 100 మంది ఉద్యోగులతో ఇది మొదలు కానున్నది. పుణె, బెంగళూరు, చెన్నై ఆధారంగా కార్యకలాపాలు సాగుతాయి.

ఎఫ్ఎంసీజీపై పామాయిల్ పిడుగు

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: అంతర్జాతీయ మార్కెట్లో భగ్గుమంటున్న పామాయిల్ ధరలు దేశీయ ఎఫ్ఎంసీజీ రంగ సంస్థల లాభాలపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపనున్నది. సెప్టెంబర్ త్రైమాసికంలో ఆయా సంస్థల లాభాలు భారీగా తగ్గే అవకాశాలున్నాయని సర్వే వెల్లడించింది. ఒకవైపు పామాయిలు ధరలు, మరోవైపు ఉత్పత్తి వ్యయం, ప్రకటనలకోసం అధికంగా నిధులు వెచ్చించడంతో మార్జిన్లు, లాభాలపై ప్రతికూల ప్రభావం పడనున్నది. గోద్రెజ్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్, డాబర్, మారికోలు తమ లాభాలు ఏడాది కనిష్ఠ స్థాయికి పడిపోయే అవకాశాలున్నాయని పేర్కొన్నాయి.

హైదరాబాద్‌లో 'రియల్' డౌన్

19 శాతం తగ్గిన ఇండ్ల అమ్మకాలు దేశీయ ప్రధాన నగరాల్లోనే అత్యధికం

జూలై-సెప్టెంబర్‌లో 11,564 యూనిట్లకే పరిమితం ప్రాప్‌టైగర్ తాజా సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: రాష్ట్ర రియల్ ఎస్టేట్ మార్కెట్ మందగమనంలోకి జారుకున్నది. హైదరాబాద్‌లో వరుసగా పడిపోతున్న ఇండ్ల అమ్మకాలు దీన్నే సూచిస్తున్నాయి మరి. ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలోనూ గృహ విక్రయాలు నీరసంగానే సాగాయి. ప్రముఖ రియల్ ఎస్టేట్ బ్రోకరేజీ వేదిక ప్రాప్‌టైగర్.కామ్ మంగళవారం దేశీయ రెసిడెన్షియల్ మార్కెట్‌పై 'రియల్ ఇన్‌సైట్' పేరిట విడుదల చేసిన నివేదిక ప్రకారం.. గత నెల సెప్టెంబర్‌తో ముగిసిన 3 నెలల్లో హౌజింగ్ సేల్స్ ఏకంగా 19 శాతం దిగజారాయి. దేశంలోని 7 ప్రధాన నగరాల్లో ఇదే అత్యధికం కావడం గమనార్హం. నిరుడు జూలై-సెప్టెంబర్‌లో 14,191 యూనిట్ల అమ్మకాలు జరిగాయి. ఈ ఏడాది ఇదే సమయంలో 11,564 యూనిట్లకే పరిమితమయ్యాయి.

బయ్యర్లలో తగ్గిన ఆసక్తి

గత ఏడాదిదాకా హైదరాబాద్‌లో పరుగులు పెట్టిన స్థిరాస్తి మార్కెట్.. ఇప్పుడు పడకేసింది. ప్రస్తుతం కొనుగోలుదారుల్లో ఇండ్లను కొనాలన్న ఆసక్తే కనిపించట్లేదని వ్యాపారులు చెప్తున్నారు. మార్కెట్‌లో నెలకొన్న ఇబ్బందికర పరిస్థితులు ఒక కారణమైతే.. రుణ లభ్యత కఠినం కావడం మరో కారణమని వారు అంటున్నారు. కాగా, పరిస్థితులు ఇలాగే సాగితే కేవలం నిర్మాణ రంగమేగాక, దాని అనుబంధ రంగాలూ సంక్షోభంలోకి జారుకుంటాయని ఇండస్ట్రీ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

హైడ్రా ఎఫెక్ట్

రాష్ట్ర రియల్ ఎస్టేట్ రంగంలో హైడ్రా ప్రకంపనల్ని సృష్టిస్తున్నది. హైదరాబాద్‌లో తెచ్చిన హైడ్రా.. ఇతర నగరాల్లోని లావాదేవీలపైనా గట్టి ప్రభావాన్నే చూపుతున్నది. ఇక రాజధానిలోనైతే హైడ్రా దెబ్బకు బయ్యర్లు.. ముఖ్యంగా ఎగువ మధ్యతరగతి వర్గాలు ఇండ్లు, ఫ్లాట్లు, ప్లాట్లు కొనాలనే ఆలోచననే వాయిదా వేసుకుంటున్నారు. దీంతో కొత్త నిర్మాణాలన్నీ ఆగిపోయాయి. ఇప్పటికే పూర్తయిన ఇండ్లనూ కొనేవారు లేకపోవడంతో పెట్టిన పెట్టుబడుల్ని రాబట్టుకొనేందుకు తక్కువ ధరలకు ఇస్తామన్నా ఆదరణే కరువైపోయింది. ఫలితంగా రియల్టర్లు ఆందోళన, ఆవేదన చెందుతున్నారు.

దేశవ్యాప్తంగా..

హైదరాబాద్‌సహా మొత్తం దేశంలోని 8 ప్రధాన నగరాల్లో ప్రాప్‌టైగర్.కామ్ తాజా సర్వే జరిగింది. ఇందులో ఢిల్లీ-ఎన్‌సీఆర్ మినహా మిగతా 7 నగరాల్లోనూ హౌజింగ్ సేల్స్ పతనమైనట్టు స్పష్టమైంది. అయితే టాప్-7 నగరాల్లో హైదరాబాద్‌లోనే అత్యధికంగా ఇండ్ల అమ్మకాలు తగ్గినట్టు తేలింది. కాగా, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో 29 శాతం విక్రయాలు పెరిగాయి. గతంతో పోల్చితే 7,800 యూనిట్ల నుంచి 10,098 యూనిట్లకు ఎగిశాయి. కోల్‌కతాలో గరిష్ఠంగా 22 శాతం క్షీణించాయి. 3,607 యూనిట్ల నుంచి 2,796 యూనిట్లకు పడిపోయాయి. ఇక బెంగళూరులో 11 శాతం, అహ్మదాబాద్‌లో 9 శాతం, చెన్నైలో 8 శాతం, పుణెలో 3 శాతం, ముంబైలో 1 శాతం చొప్పున సేల్స్ దిగజారాయి.

బీవైడీ సరికొత్త ఈవీ

సింగిల్ చార్జింగ్‌తో 530 కిలోమీటర్లు..

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: చైనాకు చెందిన ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ బీవైడీ..దేశీయ మార్కెట్లోకి మరో మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈమ్యాక్స్ 7 రూ.26.9 లక్షల నుంచి రూ.29.9 లక్షల మధ్యలో లభించనున్నది. వీటిలో ఆరుగురు కూర్చోవడానికి వీలుండే మాడల్ ధర రూ.26.90 లక్షలు, ఏడు సీట్ల మాడల్ ధర రూ.27.50 లక్షలు, సూపరియర్ మాడల్ రూ.29.30 లక్షల నుంచి రూ.29.90 లక్షల మధ్యలో లభించనున్నది. దీంట్లో 55.4 కిలోవాట్ల బ్యాటరీ ప్రీమియం మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 420 కిలోమీటర్లు ప్రయాణించనుండగా, అలాగే 71.8 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ 530 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. 10.1 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు గంటకు 180 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. ఆటోమేటిక్ క్లైమెట్ కంట్రోల్, వైర్‌లెస్ చార్జర్, ఎయిర్ ప్యూరిఫైర్, మూడు ఎయిర్‌బ్యాగ్‌లు వంటి ఫీచర్స్ ఉన్నాయి. ఈ సందర్భంగా బీవైడీఇండియా హెడ్ రాజీవ్ చౌహాన్ మాట్లాడుతూ..దేశీయంగా ప్రవేశపెట్టిన నూతన ఈవీ పాలసీలో ప్రయోజనాలు పొందడానికి దరఖాస్తు చేసుకునే అవకాశాలు లేవని స్పష్టం చేశారు.

ఈసారి కూడా వడ్డీరేట్లు యథాతథమే!

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: ఈసారి కూడా రిజర్వ్‌బ్యాంక్ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలున్నాయి. దేశవ్యాప్తంగా కూరగాయల ధరలు భగ్గుమంటుండటంతో ఆహార ద్రవ్యోల్బణ సూచీ గరిష్ఠ స్థాయిలోనే నమోదవుతుండటంతో బుధవారం ప్రకటించనున్న తన పరపతి సమీక్షలో వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలున్నాయని ఇండస్ట్రీ వర్గాలు అంచనావేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి మాత్రం వడ్డీరేట్లను అర శాతం తగ్గించేందుకు ఆస్కారం ఉన్నదని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ ఎండీ, సీఈవో ధీరజ్ రెల్లి తెలిపారు. వరుసగా పది సమీక్షల్లో వడ్డీరేట్లను ముట్టుకోకపోవడంతో రెపోరేటు 6.50 శాతం వద్ద కొనసాగుతున్నది. దేశ ఆర్థిక వ్యవస్థ ఆందోళనకరంగా ఉండటం, పశ్చిమ దేశాల్లో యుద్ధమేఘాలు కమ్ముకోవడంతో చమురు ధరలు భారీగా పెరిగే అవకాశం ఉన్నదని, ఈ నేపథ్యంలో వచ్చే రెండు సమీక్షల్లో ప్రస్తుత రేట్లను కొనసాగించే అవకాశాలున్నాయన్నారు. తొలి త్రైమాసికంలో వృద్ధి 7.5 శాతం సాధించింది.

హైదరాబాద్‌లో తైవాన్ ఇండస్ట్రియల్ పార్క్

హైదరాబాద్, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ శివార్లో ప్రత్యేకంగా తైవాన్ పరిశ్రమ పరిశ్రమల కోసం ప్రత్యేకంగా ఓ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దండుమల్కాపూర్‌కు సమీపంలో ఈ పార్క్‌ను ఏర్పాటు చేయాలని నిశ్చయించారు. ఇందుకు సంబంధించి తైవాన్ చాంబర్ ఆఫ్ కామర్స్(టీసీసీ) ఉపాధ్యక్షుడు సైమన్ లీ, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి మంగళవారం టీజీఐఐసీ కార్యాలయంలో ద్వైపాక్షిక ఒప్పందంపై సంతకాలు చేశారు. దండుమల్కాపూర్ సమీపంలో ఇప్పటికే ఉన్న 600 ఎకరాల ప్రభుత్వ భూమితోపాటు మరో 400 ఎకరాలు సేకరించి మొత్తం వెయ్యి ఎకరాల్లో ఈ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతిపాదనలు చేసింది. తైవాన్ నుంచి రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ ఒప్పందం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. హైదరాబాద్‌లో తైవాన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం ఇప్పటికే రూపకల్పన జరిగిందని, పెట్టుబడిదారులతో సమావేశాలు, రాష్ట్రాన్ని అంతర్జాతీయంగా ప్రమోట్ చేయడం లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

హమ్మయ్య..కోలుకున్నాయి

సెన్సెక్స్ 584, నిఫ్టీ 217 పాయింట్ల లాభం • 7.5 లక్షల కోట్లు పెరిగిన మదుపరుల సంపద



ముంబై, అక్టోబర్ 8: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస నష్టాలకు బ్రేక్‌పడింది. వరుసగా ఆరు రోజులుగా భారీగా నష్టపోయిన సూచీలు తిరిగి కోలుకున్నాయి. బ్లూచిప్ సంస్థల షేర్లకు లభించిన మద్దతుకు తోడు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు సూచీలను ముందువైపుకు నడిపించాయి. ఇంట్రాడేలో 700 పాయింట్లకు పైగా పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 585 పాయింట్లు అందుకొని 81,635 పాయింట్ల వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ సైతం 217.40 పాయింట్లు ఎగబాకి తిరిగి 25 వేల మార్క్‌ను అధిగమించింది. చివరకు 25,013.15 పాయింట్ల వద్ద స్థిరపడింది. మార్కెట్లు ఉవ్వెత్తున ఎగిసిపడటంతో మదుపరుల సంపద భారీ స్థాయిలో పెరిగింది. గత ఆరు సెషన్లలో రూ.9 లక్షల కోట్లకు పైగా సంపదను కోల్పోయిన మదుపరులు ఒక మంగళవారం నాడే రూ.7 లక్షల కోట్లకు పైగా పెరగడం విశేషం. దీంతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ విలువ రూ.7,51,481.51 కోట్లు పెరిగి రూ.4,59,50,926.21 కోట్లు(5.47 ట్రిలియన్ డాలర్లు)కు చేరుకున్నది. ఆసియా, యూరప్ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలకు తోడు ఆర్బీఐ తన పరపతి సమీక్షలో తీసుకునే నిర్ణయం కోసం మదుపరులు వేచి చూస్తుండటం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధులను తరలించుకుపోయినప్పటికీ సూచీలు లాభాల్లో ముగిశాయని దలాల్ స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి.

- అదానీపోర్ట్స్ 4.76 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది.
- దీంతోపాటు మహీంద్రా, రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎల్అండ్‌టీ, ఎస్బీఐ, ఎన్టీపీసీ, అల్ట్రాటెక్ సిమెంట్, కొటక్ బ్యాంక్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, సన్ ఫార్మా, టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్‌లు లాభాల్లో ముగిశాయి.
- టాటా స్టీల్, టైటాన్, టాటా మోటర్స్, హెచ్‌యూఎల్, ఐటీసీ, టీసీఎస్, భారతీ ఎయిర్‌టెల్, మారుతి నష్టపోయాయి.
- బ్యాంకింగ్, టెలికం, వాహన, రియల్టీ రంగ షేర్లు కదంతొక్కాయి.
- రంగాలవారీగా సేవలు 3.25 శాతం, క్యాపిటల్ గూడ్స్ 2.82 శాతం, ఇండస్ట్రీయల్స్ 2.81 శాతం, పవర్ 2.44 శాతం, టెలికం 2.35 శాతం చొప్పున బలపడ్డాయి.
- ప్రారంభంలో భారీగా నష్టపోయిన ఓలా షేరు చివర్లో కోలుకున్నది. కొనుగోలుదారులను తప్పుదోవ పట్టించేలా ప్రకటనలు, వాణిజ్య ఉల్లంఘనలు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో గత మూడు రోజులు పతనమైన షేరు 5 శాతం లాభపడి రూ.95.46 వద్ద ముగిసింది.

స్టాండర్డ్ గ్లాస్ ఐపీవోకి సెబీ గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్, అక్టోబర్ 8: రాష్ట్రానికి చెందిన ఫార్మాస్యూటికల్, కెమికల్ రంగ పరికరాల తయారీ సంస్థ స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టడానికి లైన్ క్లియర్ అయింది. ఇందుకు సంబంధించి సంస్థ దాఖలు చేసుకున్న ఐపీవో ప్రతిపాదనకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జూలై 24, 2024 నాడు సంస్థ ఐపీవోకి దరఖాస్తు చేసుకున్నది. వాటాల విక్రయం ద్వారా గరిష్ఠంగా రూ.600 కోట్ల వరకు నిధులు సమీకరించాలని యోచిస్తున్నది. దీంట్లో భాగంగా తాజా షేర్లను జారీ చేయడంతో రూ.250 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో మరో 1.84 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించడం ద్వారా మరో రూ.350 కోట్లు సేకరించాలనుకుంటున్నది. ఇలా సేకరించిన నిధులను భవిష్యత్తు వ్యాపార విస్తరణకోసం, రుణాల చెల్లింపుల కోసం వినియోగించనున్నది. దీంతోపాటు మరో ఐదు కంపెనీల ఐపీవోల ప్రతిపాదనకు సెబీ అనుమతినిచ్చింది. వీటిలో ఎన్ఎస్‌డీఎల్, జింకా లాజిస్టిక్స్ సొల్యూషన్స్, ఎన్ఎస్ఈ, ఎస్బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లు కూడా ఉన్నాయి.